ఇసుక సమస్యను నివారించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గంలో ఇసుక సమస్యను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్‌ను కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ కోడూరు ప్రాంతంలో భవన నిర్మాణాలు చేపడుతున్న ప్రజలు ఇసుక కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్టాక్ యార్డ్ నుంచి వినియోగదారులకు చేరడానికి ఎక్కువ దూరం అవుతుందని తద్వారా ప్రజలకు ఆర్థిక భారం అధికమవుతుందని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా నారాయణ నెల్లూరు వద్ద ఉండే ఇసుక రీచ్‌లకు అనుమతి ఇవ్వాలని కోరారు.

జెసికి సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయి వికాస్

పెరుగుతున్న భూ బాధితుల చిట్టా

సబ్ కలెక్టరేట్‌కు క్యూకట్టిన బాధితులు - న్యాయం జరుగుతుందని గంపెడాశ

సబ్ కలెక్టర్ కార్యాలయానికి క్యూ కట్టిన బాధితులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాల దహనం ఘటన జరిగిన అనంతరం అన్యాయంగా భూములు కోల్పోయిన బాధితులు తమకు న్యాయం జరుగుతుందన్న గంపెడాశతో సబ్ కలెక్టర్ కార్యాలయానికి క్యూకట్టారు. కార్యాలయంలో దస్త్రాల ఘటన కేసులో గత ప్రభుత్వంలోని కొంతమంది భూ బకాసురులు అనేక వేల కోట్ల విలువచేసే భూములను కొల్లగొట్టారని వాటిని కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో రికార్డులు దగ్ధం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో 22 ఏ భూములు, నిషేధిత భూములు, చుక్కల భూము లు, వివాదాస్పద భూములతో పాటు తదితర పలు కీలక రికార్డులు ఉన్న కార్యాలయం మొత్తం దగ్ధం కావడంతో ప్రభుత్వం రాష్ట్ర స్థాయి అధికారులను రంగంలోకి దింపింది. ఈ కోవలో రెవెన్యూ సిఎస్ సిసోడియా మదన పల్లిలో రెండు రోజులు మకాం వేసి దర్యాప్తు చేపట్టారు. గురు, శుక్ర, శనివా రాలలో సుమారు 500కు పైగా బాధితులు అర్జీలు సమర్పించగా సోమవారం మరో 200 మంది వరకూ అర్జీలను సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు అందించారు. ఇందులో సెటిల్మెంట్ భూములు లాక్కున్నారని, డికెటి భూములను ఆక్రమిం చుకున్నారని, తమ భూముల్లో ప్రభుత్వం రోడ్లు కాలువలు నిర్మించి పరిహారం ఇవ్వలేదని, ఇంటి స్థలాలను కబ్జా చేశారని అధికారులకు మొర పెట్టుకున్నారు. పరిశీలించిన అనంతరం బాధితులకి న్యాయం చేస్తామని అధికారులు చెబుతున్నారు.

బెదిరింపులు తప్పలేదు

స్వతహాగా తాను న్యాయవాదిని, మాకు బండకింద కమ్మపల్లెలో 20 సెంట్లు స్థలం ఉంది. అది వివాదంలో ఉండడంతో కోర్టులో కేసు జరుగుతోంది. ఈ భూమిపై కన్నేసిన వైసిపి నేత మాధవరెడ్డి నన్ను బెదిరించి భూమిని రాసియ్యమని దౌర్జన్యం చేశాడు. వారి దౌర్జన్యాల వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయి. అందరికీ న్యాయం జరగాలి.

- మనోహర్ నాయుడు, న్యాయవాది, మదనపల్లె.

వైసిపి నేత మా భూమిని కాజేశాడు

పుంగనూరు మండలం మేలిమిదొడ్డి పంచాయతీలోని 11-4 సర్వేలో మాకు 1.80 ఎకరాల స్థలం ఉంది. ప్రభుత్వం ఇచ్చిన ఆ స్థలంలో పుంగనూరుకు చెందిన వైసిపి నేత ఖలీల్ అహ్మద్ పాగా వేసి మమ్మల్ని భూమిలోకి రానియ్యకుండా దౌర్జన్యం చేస్తున్నాడు. అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేదు. ఇక్కడ న్యాయం జరుగుతుందని వచ్చాను.

- గౌరమ్మ, బీడీ కాలనీ, పుంగనూరు.

భూమిలో కాలువ తీసి పరిహారం ఇవ్వలేదు



వలసపల్లి పంచాయతీ సర్వే నెంబర్ 718/4ఏలో 5.5 ఎకరాల భూమి కొన్నాం. అందులో సాగు చేసుకుని జీవనం చేస్తున్నాం. ఆ స్థలాన్ని హంద్రీ-నీవా కాలువకు తీసుకున్నారు. పరిహారం కోసం కొన్నేళ్లుగా కార్యాల యాలు చుట్టూ తిరుగుతున్న ఇంతవరకు ఎవరు పట్టించుకోలేదు. మాకు న్యాయం చేయాలని ఇక్కడికి వచ్చాం.

- జయరాం సింగ్, మదనపల్లె.

స్థలాన్ని ఖాళీ చేయమంటున్నారు

మా కుటుంబం మొత్తం దేశానికి సేవ చేశాం. నాతో పాటు మా నాన్న సైనికుడు. మా కుటుంబంలో ముగ్గురం సైనికులు ఉన్నాం. మాకు 1989లో స్థానిక పుంగనూరు రోడ్డులోని ఆదిత్య కాలేజ్ వద్ద ప్రభుత్వం 10 ఎకరాల స్థలాన్ని ఇవ్వడంతో అక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం చేస్తున్నాం. భూమిని కాపాడి మాకు దక్కేలా చూడాలని అధికారులను అర్థిస్తున్నాం.

-దేవముని, మాజీ సైనికుడు మదనపల్లె.

డబ్బు తీసుకుని మోసం చేశారు

స్థలం విక్రయిస్తానని వైసిపి నేత బాబ్ జాన్ 2011లో రూ.6 లక్షలు తీసుకున్నాడు. కాలం గడిచేకొద్దీ స్థలం ఇవ్వకపోగా డబ్బులు అడిగితే తన అనుచ రులతో దౌర్జన్యం చేస్తూ చంపుతామని బెదిరిస్తున్నాడు. అతని వల్ల మాకు ప్రాణహాని ఉంది. రక్షణ కల్పించడంతో పాటు డబ్బులను ఇప్పించాలని అర్జీ ఇచ్చాం.

- నరసింహులు, మదనపల్లె.

ఆర్‌డిఒలపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాల దహనం ఘటనపై ప్రభుత్వం తొమ్మిది రోజుల సుదీర్ఘ విచారణ అనంతరం ప్రభుత్వం బాధ్యులపై చర్యలకు ఉపక్రమించింది. ఈ క్రమంలో ఇద్దరు ఆర్‌డిఒలు సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించగా రెవెన్యూ ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయ అగ్ని ప్రమాద ఘట నపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వక పోవడం, అక్కడ పోలీసులను సెక్యూరిటీగా పెట్టక పోవడం, రెవిన్యూ ఫైళ్లు కాలిపోవడానికి నిర్లక్ష్యం చేయడం వంటి అభియోగాలను పోలీసులపై మోపి క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ కోవలో పోలీస్ శాఖ నుంచి వన్ టౌన్ సిఐ వల్లిబసు విఆర్‌కు పంపగా, కానిస్టేబుల్స్ హరిప్రసాద్, భాస్కర్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా పూర్వపు ఆర్‌డిఒలు మురళి, హరిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజను సస్పెండ్ చేశారు. అవినీతి అక్రమాలకు పాల్ప డిన నాయకులతో పాటు వారికి సహక రించిన అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పలువురు కార్యాలయ అధికారులు, సిబ్బంది, మండల తహశీల్దార్లు, సర్వేయర్‌లు, ఆర్‌ఐలు, విఆర్‌ఒ, విఆర్‌ఎలను అధికారులు విచారించిన సంగతి తెలిసిందే. కొంత మంది అధికారుల ప్రమేయం ఉందని వారిలో కొంతమందిని సస్పెండ్ చేయడంతో పాటు మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయని ఇదివరకే రెవెన్యూ చీఫ్ ప్రకటించిన సంగతి విదితమే. ఈక్రమంలో అధికారుల సస్పెన్షన్ పలు అధికారుల్లో అనిశ్చితి నెలకొంది.

ప్రస్తుత, పూర్వ ఆర్‌డిఒలు హరిప్రసాద్, మురళి, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ

పథకం ప్రకారమే ఫైళ్ల కాల్చివేత

- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్య కాండ విధానాన్ని భూస్థాపితం చేయాలని ఇందుకోసం ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం స్థానిక మదనపల్లె కలెక్టర్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. సిపిఐ నాయకులతో కలిసి గేటు ముందుకు రాగానే నారాయణను లోపలికి అనుమతించకుండా పోలీసులు అడ్డుకున్నారు. తాము కార్యాలయంలోకి వెళ్లమని బయట నుంచే పరిశీలిస్తామని ఎంత చెప్పినా పోలీసులు వినలేదు. తమకుపై అధికారుల నుంచి ఆదేశాలు వస్తానే లోనికి అనుమతిస్తామంటూ ఆపేశారు. ఓ దశలో నారాయణను నెట్టేసే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంలో సిపిఐ నాయకులకు పోలీసులు మధ్య ఒకింత తోపులాట జరిగింది. ప్రతిఘటించిన సిపిఐ నాయకులు వెనుతిరగకుండా పోలీసులను నెట్టుకుంటూనే ముందుకు కదిలారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో తగలబడిన కార్యాలయాన్ని బయట నుంచి పరిశీలించారు. కాలిపోయి కిందపడిన ఫైళ్లలోని పేపర్లను పరిశీలించారు. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న ప్రజల జీవితాల్లో కష్టాలు పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినప్పటికీ పాత కాంట్రాక్టర్లే మొత్తం దందా నడుపుతున్నారని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా భూ భకాసురల ఆగడాలు మాత్రం ఆగడం లేదని తెలిపారు. ప్రభుత్వాలు సైతం పేదల పక్షాన నిలబడడం లేదని తెలిపారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో పెద్ద ఎత్తున భూ ఆక్రమణలు జరిగాయి కాబట్టే ప్రభుత్వం మారిన వెంటనే భూ రికార్డులను భద్రపరిచే గదిని ప్రణాళికా ప్రకారం కాల్చివేసినట్లు స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఇటీవల తెలంగాణలో సైతం ప్రభుత్వం మారిన వెంటనే వేల కోట్లు అవినీతి జరిగిన టూరిజం శాఖలో ఫైళ్లను తగలబెట్టారన్నారు. అక్కడ ఇప్పటికీ సమగ్ర దర్యాప్తు చేయలేదన్నారు. మదనపల్లెలో రాజుకున్న భూకుంభకోణాల భాగోతం రాష్ట్రం మొత్తం వ్యాపించిందన్నారు. ప్రజలు ఇప్పుడిప్పుడే భయం వీడి న్యాయం కోసం అధికారులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ డివిజన్ లోని భూ బాధి తులకు సిపిఐ అండగా ఉంటుందన్నారు. నేర సామ్రాజ్యం విస్తరించకుండా కట్టడి చేయాల్సిన పోలీసులు ప్రజా పోరాటలు చేసే వారిమీద జులుం ప్రదర్శించడం తగదన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య, నాయకులు కృష్ణప్ప, సాంబశివ, మురళి, నరసింహులు, విశ్వనాథ్, కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్, మహ్మద్ పీర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా నిందితులను అరెస్టు చేస్తాం : డిఐజి ప్రవీణ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల కేసులో పకడ్బందీగా నిందితులను అరెస్టు చేస్తామని కర్నూల్ రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ స్పష్టం చేశారు. సోమవారం రాత్రి మదనపల్లి డిఎస్‌పి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో ఉండకూడని కొన్ని దస్త్రాలు స్వాధీనం చేసుకుని నవాజ్ బాషాపై ఒక కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. అనుమానితులను విచారించామే కానీ అదుపులో ఎవరూ లేరని చెప్పారు. ఫైళ్ల దగ్ధం ఘటనపై ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు వస్తూనే 15 రోజుల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేస్తామని తెల్చి చెప్పారు. ఈ కేసును అన్ని సాంకేతిక టెక్నాలజీల సహకారంతో పరిశోధిస్తున్నామని, సిసి టివి ఫుటేజీలను పరిశీలించామన్నారు. సెల్ టవర్ డంప్స్ తీస్తాం, 2000 పైగా ఫోన్ కాల్ డేటాను పరిశీలించామని తెలిపారు. వాట్సాప్‌కు సంబంధించిన ఐపిడి అన్ని కూడా పరిశీలించామన్నారు. వీటన్నిటిని ఆధారంగా అనుమానితుల ఇళ్లను సోదాచేసి విలువైన ఆధారాలు సేకరించామన్నారు. ఈ పరిశోధనకు ఉపయోగపడని ఫైళ్ళను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటిపై ఎనిమిది కొత్త కేసులు కూడా రిజిస్టర్ చేసామని పేర్కొన్నారు. పగడ్బందీగా దర్యాప్తు చేసి ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు వచ్చాక నిందితులను నిర్ధారించుకుని అందర్నీ అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు 15 మంది అనుమానితులను విచారించామని పేర్కొన్నారు. వారిలో స్థానిక వైసిపి నాయకులు రైస్‌మిల్ మాధవరెడ్డి ఇంటిలో 500 దాకా ఇళ్ల స్థలాలు, భూముల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామన్నామని తెలిపారు. ఆయన విచారణకు అందుబాటులో లేకుండా పరారీలో ఉన్నాడన్నారు. హైదరాబాదులో శశికాంత్ ఇంట్లో మదనపల్లెకి చెందిన భూముల రికార్డులు కూడా దొరికాయని, మాజీ మంత్రి పిఎ తుకారం ఇంట్లో కూడా సోదాలు చేశామని తెలిపారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ఇంట్లో ఫైళ్ళకోసం సోదాలు చేశామన్నారు. 15 టీములు ఈ కేసులో సిఐడి అధికారుల సహకారంతో విచారణ చేశారు. కొంతమంది బాదితులు తమను మాధవరెడ్డి తదితరులు బెదిరించారని రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అటువంటి బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్లు ఫిర్యాదు చేస్తే తప్పకుండా కేసులు నమోదు చేస్తామని డిఐజి స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఇన్వెస్టిగేషన్ అధికారి రాజ్ కమల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కర్నూల్ రేంజ్ డిఐజి ప్రవీణ్

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను నాణ్యతే ప్రామాణికంగా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జెసి ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌ఒ సత్యనారాయణలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో అందిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీలోని అంశంపై దృష్టి పెట్టి, సమస్యను సావధానంగా వినాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను పరిశీలించి, వివాదాలకు సంబంధించి ఇరువురిని విచారణ చేసి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఈ విధంగా 60 శాతం సమస్యలను మన పరిధిలో పరిష్కరించవచ్చని, మిగిలిన 40 శాతం కమిషనరేట్ల స్థాయి, ప్రభుత్వ పరిధిలో ఉంటాయి అని అలాంటి వాటిపై వెంటనే చర్యలు తీసుకొని ఉన్నత స్థాయికి నివేదించాలని చెప్పారు. ఇవికాక కోర్టు పరిధిలోనివి వ్యక్తిగత కారణాలు, ఇతరత్రా విషయాలకు సంబంధించినవి వారితో మాట్లాడి సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ పరిధిలోకి వెళ్లకుండా నిర్ణీత కాల వ్యవధిలోపు నాణ్యతగా పరిష్కరించాలని చెప్పారు. పెండింగ్ దరఖాస్తులు రీఓపెనింగ్ కాకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కాల్ సెంటర్ ఏర్పాటు

30 మండలాల పరిధిలోని పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు, వీధిలైట్ల నిర్వహణ వంటి వాటికి సంబంధించిన ఫిర్యాదులకు జిల్లా స్థాయిలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి జిల్లాస్థాయి కాల్ సెంటర్ ఏర్పాటు ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పంచాయతీలను శుభ్రంగా ఉంచాలని చెప్పారు. పంచాయతీల నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్ల నిర్వహణ, పంచాయతీలకు సంబంధించిన ఫిర్యాదులను కార్యాలయపు పని వేళలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు మొబైల్ 8019214517కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. డివిజన్, మండల, గ్రామ స్థాయిలో కూడా ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కాల్ సెంటర్ ద్వారా అందిన సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్‌ఒ సత్యనారాయణ రావు, డిపిఒ ధనలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

నూతన వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి

- వ్యవసాయ పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ సుమతి

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి- రామాపురం

నూతన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి పొందవచ్చని పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ సుమతి అన్నారు. మండలంలోని గోపగుడిపల్లి గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు పొలంలో జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా వేరుశనగలు- సామూహిక ప్రథమ శ్రేణి క్షేత్ర ప్రదర్శనలను సోమవారం వ్యవసాయ పరిశోధన సహాయ సంచాలకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త రకాలు నూతన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి పెంపొందించాలనేదే సామూహిక ప్రథమ శ్రేణి క్షేత్ర ప్రదర్శన ముఖ్య ఉద్దేశమన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాన్ని ఉత్పత్తి చేసి వాటిని రైతు ఉత్పత్తి దారుని సంస్థల ద్వారా విక్రయం చేపట్టడం వల్ల అధిక ధర లభిస్తుందని తెలిపారు. వర్షాధారిత వేరుశనగలో పొటాష్ వినియోగంపై క్షేత్ర పరిశీలన చేయడం వల్ల నూతన యాజమాన్య పద్ధతులపై రైతులు మొగ్గు చూపే అవకాశం ఉంటుందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతోపాటు సలహాలు అందించడంలో విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎంతో కృషి చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వీరయ్య. కార్యక్రమ సమన్వయకర్త, డాక్టర్ విశ్వనాథ్ శాస్త్రవేత్త తెగుళ్ల విభాగం. తిరుపతి డాక్టర్ వి శిల్పకళ, శాస్త్రవేత్త సస్య రక్షణ విభాగం డాక్టర్ కె.సాయి మహేశ్వరి. శాస్త్రవేత్త సేద్యవిభాగం కృషి విజ్ఞాన కేంద్రం శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి వై నాగమణి, విఎఎ గోపగుడిపల్లి రైతులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి పాటుపడాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరబల్లి

ప్రజాప్రతినిధులు రాజకీయాలు, కక్షలు మాని పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి పాటుపడాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన ఎంపిడిఒ రామచంద్రరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమన్వయంతో నిధులు తెప్పించి వీరబల్లి మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం మారిందని ప్రజా ప్రతినిధులు అధికారులకు సహకరించి అభివృద్ధికి కృషి చేసేలా చూడాలన్నారు. మండల అధికారులు ఆ దశలోనే పయనించాలన్నారు. అధికారులను ఎటువంటి ఇబ్బందులు పెట్టరాదన్నారు. మండలంలోని ఆయా శాఖ అధికారులు పురోగతిని వినిపించారు. నీటి సమస్యపై మట్లి, వీరబల్లి, తాటి గుంటపల్లి, సానిపాయి, సర్పంచులు నాగార్జునచారి, నీతి ఆంజనేయులు, గోపీనాథ్ రెడ్డి, చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో చేతి పంపుల మరమ్మతులకు నోచుకోలేదని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌ఛార్జి జెఇ కృష్ణయ్య మాట్లాడుతూ వర్షాలు కురవనందున గ్రామాల్లో నీటి సమస్య తలెత్తిందన్నారు. ఎంపిడిఒ మాట్లాడుతూ నీటి సరఫరాకు మండల కమిటీ ఆమోదం తెలపాలన్నారు. ఏ గ్రామంలో నీటి అవసరం ఉందో తెలిపితే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. చేతిపంపులు తక్షణం మెకానిక్‌ను పంపి తయారు చేయిస్తామని ఆయన అన్నారు. హౌసింగ్ ఎఇ వెంకటేష్ మాట్లాడుతూ 2021-22 సంవత్సరానికి 1043 పక్క గృహాలు మంజూరయ్యాయని, వాటిలో 670 పక్కాగృహాలు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన 373 గృహాలు వివిధ దశలో ఉన్నాయని వివరించారు. డిసెంబర్‌లోగా గృహాలు పూర్తిచేయాలని లబ్ధిదారులకు ఆదేశించామన్నారు. డాక్టర్ జియాఉల్లా మాట్లాడుతూ డెంగీ జ్వరాలు వస్తున్నాయని, దోమల నివారణకు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతంలో లార్వాలు అధికమై దోమలుగా మారి కాటు వేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి శివరాం గౌడ్, మండల నాయకుడు వీరనాగిరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ వెంకటనారాయణ రావు, అగ్రికల్చర్ స్వాతి, ఎంఇఒ కృష్ణయ్య, ఎపిఒ నాగరాజా, ఖాదరవల్లి, విద్యుత్ సబ్ ఇంజినీర్ కేశవ్, హేయ్ అశోక్,అధికారులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి

ఉద్యోగోన్నతులు వెంటనే చేపట్టాలి

ప్రజాశక్తి - రాయచోటి : రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను ఎస్‌జిటిలతో హెడ్‌మాస్టర్లుగా ఉద్యోగోన్నతుల నెలవారి చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండాఊరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. సోమవారం నేతాజీ సర్కిల్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంకా చాలా పాఠశాలల్లో ఖాళీలు ఉన్నందున పాఠ్యాంశాల బోధన, విద్యా ప్రమాణాల పెంపు చాలా కష్టంగా ఉందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుల పోస్టులు చాలా ఖాళీగా ఉండటం వల్ల ఎఫ్ఎసితో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అటు ప్రధానోపాధ్యాయ బాధ్యతలు, సబ్జెక్టు బోధన, రోజువారి సమాచారాన్ని విద్యాశాఖకు అందజేయడం చాలా కష్టంగా ఉందన్నారు. విద్యా ప్రమాణాల పెంపుకు నెలవారి ఉద్యోగోన్నతలు అనివార్యమన్నారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు 62 ఏళ్ల వరకు వయసును పెంచాలని, 12 నెలల జీతాన్ని చెల్లించాలని ఆయన కోరారు. ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్న కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాడు- నేడు పనులలో జరిగే విచారణలో ప్రధానోపాధ్యాయులను బాధ్యులను చేయకుండా ఆయా పాఠశాలలో పనులు చేసిన కాంట్రాక్టర్లను విచారించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఊడగండ్ల రమేష్, నరసింహారెడ్డి, కులశేఖర్‌రెడ్డి, ఫకీర, నాగేంద్రబాబు, నాగరాజు, శ్రీనివాసులు, రాజబాబు, మందపల్లి వెంకటేష్, ఆసిఫ్, చంద్రశేఖర్, రామాంజులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా ప్రజలందరిలో దేశభక్తి భావాలు రేకెత్తించేలా పండుగ వాతావరణంలో 78వ పంద్రాగస్టు వేడుకలను పెద్దఎత్తున చేపట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వివిధ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాల్లో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కనువిందు చేసే రీతిలో నిర్వహించాలని చెప్పారు. వేదికను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలపై శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా, అందరిని ఆకట్టుకునేలా ఉండాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధిపై సందేశ బుక్‌లెట్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య సమరయోధులకు, జిల్లా ప్రజాప్రతినిధులకు, అధికారులకు వేర్వేరుగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆర్‌డిఒకు సూచించారు. ఆహ్వాన పత్రికలు,త్రాగునీరు ఏర్పాటు, పారిశుధ్య చర్యలు తీసుకోవాలన్నారు. అత్యంత ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాల జారీకి జాబితాను సిద్ధం చేయాలని డిఆర్‌ఒను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా ఫారెస్ట్ అధికారి శుభమ్, డిఆర్‌ఒ సత్యనారాయణ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయి వికాస్‌రెడ్డి

సూపర్ మార్కెట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని మల్లు సుదర్శన్‌రెడ్డి సూపర్ మార్కెట్ సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల షాపులో ఉన్న సరుకులు, వస్తువులు మొత్తం కాలిపోయాయి. విషయం తెలుసుకున్న రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి తనయుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి సూపర్ మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ మార్కెట్ యజమానులకు తమ వంతుగా తగిన న్యాయం చేస్తామని తెలిపారు. విద్యుత్ పట్ల ప్రజలు, వ్యాపారస్తులు, అప్రమత్తంగా ఉండాలన్నారు. రూ.లక్షల్లో నష్టం వాటిలినట్టు సూపర్ మార్కెట్ యజమాని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు

ప్రజాశక్తి-కలికిరి

ఇంటి వద్దకే పింఛన్ల కార్యక్రమాన్ని లబ్ధిదారులు అందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ రామకృష్ణ తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీన వితంతు, వికలాంగ, వృద్ధులకు ప్రభుత్వం అందించే పింఛన్లు అన్ని గ్రామాల్లో లబ్ధిదారుల ఇంటి వద్దనే సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామన్నారు. ఒకటో తేదీన లబ్ధిదారులు తప్పనిసరిగా ఇంటి వద్దనే ఉండి పింఛను తీసుకోవాలని కోరారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా లక్ష్మీప్రసన్న

బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీప్రసన్న

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల ఇన్‌ఛార్జి తహశీల్దార్ లక్ష్మీప్రసన్న సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకి అందుబాటులో ఉంటూ భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తాన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకి అందుబాటులో ఉంటూ తమవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడడం తమ వంతు బాధ్యతని పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొనడం.

సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చాలా ఏళ్లుగా సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వైఖోమ్ నిధియాదేనికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టల్లో విద్యార్థులు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తద్వారా హాస్టల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయిందని పేర్కొన్నారు. పదేళ్లుగా అద్దె భవనాలలో నడుస్తున్న హాస్టళ్లకు పక్క భవనాలు నిర్మించాలని, శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ హాస్టళ్ల భవనాలు చక్కదిద్దాలన్నారు. హాస్టల్లో లైట్లు, ఫ్యాను, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. హాస్టల్లో నెలకొన్న సమస్యలపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక అందించాలని, హాస్టల్లో ఏర్పడ్డ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు చెంగయ్య, సంతోష్, వినయ్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ నిక్కచ్చిగా జరగాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిక్కచ్చిగా నిర్వహించాలని ఎస్ఆర్ పి.సుబ్బారావు తెలిపారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి నెల 2024 సంవత్సరం వరకు జరిగిన ఉపాధి పనులను పరిశీలించి సామాజిక తనిఖీ నిర్వహించాలన్నారు. సామాజిక తనిఖీ నిర్వహణ తీరుపై శిక్షణ ఇచ్చారు. నిర్వహణపై మండల టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, విలేజ్ యాక్టివిటీల ద్వారా 7 మంది డిఆర్పిల ఆధ్వర్యంలో ఈ తనిఖీ నిర్వహించాలన్నారు. ఎక్కడ పొరపక్షాలు రాకుండా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఎపిడి మధుబాబు, ఎస్‌పిఎం లోకేష్‌రెడ్డి, ఎపిఒ అంజనప్ప, మండల టిడిపి అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి పాల్గొన్నారు

రోడ్లు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు : పట్టణంలో ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయించాలని పీలేరు ఎంపిడిఒ ఉపేంద్రరెడ్డికి ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు, సోమవారం స్థానిక ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు పట్టణ పరిధిలోని తిరుపతి రోడ్డు, కోటపల్లె రోడ్డు తదితర ప్రాంతాల్లో జియో నెట్వర్క్ వారు, ఇతర నెట్ వర్క్ కేబుల్ విస్తరణలో భాగంగా ఇష్టానుసారంగా జేసీబీలతో తవ్వేసి వదిలేశారని అన్నారు. ఫలితంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. పట్టణంలో తాగునీటి కొళాయి కనెక్షన్ కోసం త్రవ్వకాలు చేసినా దాన్ని త్రవ్వకాలు చేపట్టిన వారే పూడ్చాలన్న పంచాయితీ నిబంధనలు ఉన్నాయని, మరి ఆ నిబంధనలు జియో వంటి నెట్వర్క్ కంపెనీలకు వర్తించవా అని కూడా వారు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కేబుల్ నెట్వర్క్ వారు తవ్వకాలు చేసిన ప్రాంతాల్లో పరిశీలన చేపట్టి సీసీ రోడ్లు, తారు రోడ్లు యదా స్థానంలో మరమ్మతులు చేపట్టడానికి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బస్టాండ్ లోనికి వెళ్లే మార్గంలో పంచాయతీ కాలువ తీసి వదిలేయడంతో వాహనాలకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని కూడా తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎస్పి పీలేరు నియోజకవర్గం ఇన్చార్జి గండికోట వెంకటేష్, ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ కో-ఇన్‌ఛార్జి అమరాల వెంకటరమణ, విహెచ్పిఎస్ నాయకులు భాస్కర్, ఎంఆర్పిఎస్ పీలేరు మండల అధ్యక్షులు చరణ్ కుమార్, యువ నాయకులు రాజేష్, అన్నవరం పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నాయకులు

అభివృద్ధికి అందరూ సహకరించండి : ఎంపిపి

ప్రజాశక్తి-రామాపురం

మండల అభివృద్ధికి సభ్యులు, అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు సమిష్టిగా సహకరించాలని ఎంపిపి గడికోట విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సభ భవనంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలతో పాటు మండల కేంద్రంలో అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా సాగునీరు, విద్యుత్, వైద్యం వంటి విషయాలపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా అంటువ్యాధులు ప్రబల కుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సిద్దేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 35 రేషన్ షాపులు ఉండగా అందులో 23 శాశ్వతం, 12 తాత్కాలిక షాపులు ఉన్నాయని ఆయన అన్నారు. చౌక దుకాణాల పరిధిలో ఉన్న ప్రజలకు రేషన్ బియ్యం ప్రభుత్వం నుంచే వచ్చే నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మండల వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ మండలంలో 40 వేలు జనాభా ఉండగా మంచినీటి ద్వారా డెంగీ లాంటి వ్యాధులు వస్తున్నాయని, నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. పగలు కుట్టే దోమల వల్ల డెంగీ వస్తుందన్నారు. మండల వ్యాప్తంగా సచివాలయాల్లో 2000 మందికి బిపి, షుగర్ వంట మందులు పంపిణీ చేశామన్నారు. ఎంఇఒ జయచంద్ర మాట్లాడుతూ 33 పాఠశాలలో నాడు - నేడు కింద పనులు జరుగుతున్నాయని, వాటిలో 50 శాతం వరకు పనులు పూర్తి చేశామని, మిగిలిన వాటిల్లో నిధులు లేక పనులు ఆగిపోయాయని ఆయన అన్నారు. ఎపిఒ సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పని కావాల్సిన వారికి కల్పిస్తామని ఆయన చెప్పారు. గ్రామాల్లో పశువులకు, మేకలు, గొర్రెలకు నీరు నాలుక, గాలికుంటు వ్యాదులు ప్రబలి అధిక సంఖ్యలో మూగజీవులు చనిపోతున్నాయని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హుసేనమ్మ తెలిపారు. మండల వ్యాప్తంగా 13 గ్రామపంచాయతీలో వివిధ రకాలైన పింఛన్లున్నాయని గత నెలలో 95 శాతం ఒక రోజులోనే గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేసి, జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచామని చెప్పారు. మండలంలో192 క్లస్టర్లలో సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. నీలకంఠరావుపేటలో విద్యుత్ స్తంభాలు మంజూరై ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఎలాంటి పనులు చేపట్లేదు అన్నారు. చిట్లూరు పంచాయతీ పాలన్న గారి పల్లెలో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై మంజూరయ్యే ఏడాది అయినా ఇప్పటికీ ఏర్పాటు చేయలేదని సభ్యులు సభా దృష్టికి తీసుకువచ్చారు. పతిపల్లెకు ఆర్‌టిసి సర్వీసులు కల్పిస్తామని ఎపిఎస్ ఆర్‌టిసి అధికారి తెలిపారు. రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచనల మేరకు రాయచోటి డిపో పరిధిలోని అన్ని గ్రామాలకు రోడ్డు సర్వే నిర్వహించి ప్రయాణికులు ఉన్న ప్రతి చోటకు బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వెంకటరమణ మండల ఉపాధ్యక్షులు రవి శంకర్ రెడ్డి(బాబు), సర్పంచుల సంఘం అధ్యక్షుడు అయోధ్యపురం నాగభూషణ్ రెడ్డి. ఎంపీడీవో ప్రభాకర్. డిప్యూటీ తాసిల్దార్ సిద్దేశ్వర రావు. డాక్టర్ వినోద్ కుమార్. ఎం ఈ ఓ లు జయ చంద్రుడు. రామకృష్ణ డు. ఎఒ నాగమణి, చంద్రబాబుల్ రెడ్డి, ఎపిఒ సురేంద్రనాథరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు మండల గ్రామ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి విజయలక్ష్మి

ఉన్నత విద్యతో భవిష్యత్తుకు పునాదులు : ఎంఇఒ

కలకడ : సహపంక్తి భోజనాల్లో పాల్గొన్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఉన్నత విద్య విద్యార్థుల భవిష్యత్తుకు పునాదిలాంటిదని ఎంఇఒ నారాయణ అన్నారు. సోమవారం ముష్టూరు పంచాయతీ గౌనివారిపల్లెలోని ఎంపిపి పాఠశాలలో శిక్షా సప్తహ్ ముగింపు కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు క్రమం తప్పకుండా పంపాలని తెలిపారు. ఇంటిదగ్గర విద్యార్థులను టివిలకు దూరంగా ఉంచి వారు చదువుకునే విధంగా వాతావరణం ఏర్పాటు చేయాలని సూచించారు. శిక్షా సప్తహ్ కార్యక్రమం ద్వారా స్థానిక వనరులతో బోధనా సామగ్రి ప్రదర్శన, విద్యార్థులలో అభ్యసన అభివృద్ధి కార్యక్రమాలు, క్రీడా పోటీలు, సంస్కృతిక కార్యక్రమాలు, డిజిటల్ లెర్నింగ్, పర్యావరణ పరిరక్షణ కొరకు చెట్లు పెంచడం, పాఠశాల అభివృద్ధిలో సామాజిక భాగస్వామ్యం వంటి కార్యక్రమాలను నిర్వహించామని పేర్కొన్నారు. చివరి రోజు గౌనివారిపల్లెకు చెందిన దాత హరిబాబు సాయంతో విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. దాతకు ఎంఇఒ నారాయణ, ప్రధానోపాధ్యాయులు గురు స్వామి కృతజ్ఞతలు తెలిపారు. **కలకడ :** ప్రభుత్వం అన్ని పాఠశాలలో చేపట్టిన శిక్షా సప్తహ్ కార్యక్రమం ముగిసినట్లు ప్రధాన ఉపాధ్యాయులు మోడం చంగల్‌రాయుడు తెలిపారు. మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారం రోజులుగా జరుగుతున్న శిక్షా సప్తహ్ కార్యక్రమంలో ఎంఇఒ మునీంద్ర నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్‌పి గిరిబాబు, ఉపాధ్యాయులు శివారెడ్డి, నాగముని నాయక్, రమేష్‌రెడ్డి, రెడ్డప్ప, సైరాబాను, నౌషాద్ బేగం, ఝాన్సీరాణి, గఫార్ ఖాన్, షౌకత్ అలీ, శ్రీదేవి పాల్గొన్నారు. **గుర్రంకొండ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్నీ పాఠశాలలో చేపట్టిన శిక్షా సప్తహ్‌లో భాగంగా జడ్‌పి హైస్కూల్(తెలుగు)లో సహపంక్తి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హర్షవర్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజనం అందించారు. కార్యక్రమంలో దాతలు గుర్రం శ్రీనివాసులురెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ రవి, మంగీలాల్, సివి.రమణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని అనంతంపెల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శిక్షా సప్తహ్ చివరి రోజు సందర్భంగా పాఠశాల కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటరమణ ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులందరికీ భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జయలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రంకొండ : విద్యార్థికి భోజనం వడ్డిస్తున్న దాతలు

ఘనంగా బిటిఎ ఆవిర్భావ దినోత్సవం

కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-వీరబల్లి

బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు తిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఎంఇఒ కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏడు రోజుల శిక్షాసప్తాహ్‌లో భాగంగా ఒక్కో రోజు ఒక్కో అంశం పై కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు ప్రధానోపాధ్యాయులు రెడ్డెయ్యను ఎంఈవో అభినందించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఉపాధ్యాయులకు పంచిపెట్టారు. బిటిఎ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర మాట్లాడుతూ పోరాటమే ధ్యేయంగా ఆవిర్భవించిన బహుజన టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థుల ప్రయోజనాల కోసమే కాక సామాజిక సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పనిచేస్తోందన్నారు. నూతన పాఠ్యపుస్తకాల్లో బాబాసాహెబ్ అంబేద్కర్ ,జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ అబ్దుల్ కలాం, మల్లీ మస్తాన్ బాబు లాంటి మహనీయుల పాఠ్యాంశాలను చేర్చడంలో బిటిఎ ఎనలేని కృషి చేసిందన్నారు. తల్లికి వందనంలో ఇచ్చే రూ. 15000 ొంచెం తగ్గించైనా అన్ని పాఠశాలలకు జిలకర మసూర బియ్యాన్ని సరఫరా చేసి విద్యార్థుల కడుపు నింపాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలల మూసివేతకు కారణమైన జీవనం 117ను రద్దు చేయాలని, రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలల లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేటట్లుగా చూడాలని పేర్కొన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలను వెంటనే విడుదల చేయాలని,పెండింగ్‌లో ఉన్న జడ్‌పిఎఫ్ రుణాలు త్వరగా మంజూరు చేయాలని, ఆర్జిత సెలవు నగదును ఉపాధ్యాయులకు త్వరగా అందించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిటిఎ జిల్లా ట్రెజరర్ గోపాల్ దాస్, రాజశేఖర్, నాగముని నాయక్. రాచనాయుడు కబీర్‌బాషా, ఖాదరవల్లి, ఇర్షాద్, సతీష్ బాబు, రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

ప్రజాశక్తి- రాయచోటి

విద్యార్థుల్లో పోటీతత్వం ఉన్నప్పుడే భవిష్యత్తులో ఏ రంగంలోనైనా రాణించడానికి అవకాశం ఉంటుందని శ్రీ సాయి విద్య సంస్థల కరస్పాండెంట్ కె.పి.వి. సుబ్బయ్య అన్నారు. సోమవారం శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థుల ఇండక్షన్ తరగతుల నిర్వహణలో భాగంగా 'ఎంటర్ ప్రెన్యూర్ షిప్' అంశంపై అవగాహన తరగతులను నిర్వహించారు. కార్యక్రమాన్ని శ్రీ సాయి విద్యాసంస్థల కరస్పాండెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన ఎంతోమంది విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని చెప్పారు. పూర్వ విద్యార్థులు సంస్థలను స్థాపించి ప్రత్యక్షంగా పరోక్షంగా వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారని తెలియజేశారు. విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకొని, ఇంటి నుంచి ప్రాజెక్ట్ కంప్లీట్ చేసి ఆదాయ వనరులు మెరుగుపరుచుకోవాలని చెప్పారు. నవ కల్పనలు, యువతరం ఆలోచన విధానం ద్వారా కొత్త వ్యాపారాలు, అంకుర సంస్థలు వస్తున్నాయన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో నైపుణ్యమైన విద్యను అందించడానికి నాక్, అటానమస్ హోదా గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేశామని, అర్హత సాధించిన విద్యార్థిని విద్యార్థులకు 100 శాతం ఉద్యోగ భరోసా కల్పిస్తున్నామని వివరించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్స్, కమ్యూనికేషన్ ప్రాజెక్ట్స్, సోషల్ నెట్ వర్కింగ్‌ను సరైన రీతిలో ఉపయోగించుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలియజేశారు. భారతదేశంలో యువత శాతం అధికమని, అందుకు ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ ద్వారా మన భారత దేశ అభివృద్ధి సాధ్యమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి .బాలాజీ, వివిధ విభాగాధిపతులు, అంకుర సంస్థ కోఆర్డినేటర్ ఖలీద్, అధ్యాపకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కరస్పాండెంట్ సుబ్బయ్య

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-రామాపురం : మండలంలోని సరస్వతిపల్లె పంచాయతీలో ముమ్మరంగా పారిశుధ్యం పనులను చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో వర్షాలు పడి డ్రెయినేజీ కాలువలు నిండి రోడ్లపై మురుగునీరు రావడంతో గ్రామంలో పారిశుధ్యం లోపించి అంటువ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీలో పారిశుధ్య పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. దళితవాడలో డ్రెయినేజీ కాలువల్లో పూడి పోయిన వ్యర్థ పదార్థాలను తొలగించే పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని దోమలు వృద్ధి చెందకుండా, అంటువ్యాధులు, విషజ్వరాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని పేర్కొన్నారు.

పూడిక తీస్తున్న కార్మికులు

మాట్లాడుతున్న వెంకటేష్

అక్రమాలు, అరాచకాలకు కేరాఫ్ 'పెద్దిరెడ్డి'

- టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి వెంకటేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచకాలు, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ అని ఆయన చేసిన దోపిడీలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని టిడిపి రాజంపేట పార్లమెంట్ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం కేసుకు సంబంధించి పెద్దిరెడ్డి అక్రమాలు, భూభాగోతాలను ప్రజలు అర్జీల రూపంలో అధికారులకు ఇస్తున్నారన్నారు. ముఖ్యంగా మదనపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లో వందల ఎకరాలు ఆక్రమించి తమ కుటుంబ సభ్యులు, బినామీ పేర్లమీద రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వాపోయారు. ఇందుకు పిఎ శశికాంత్, ప్రధాన అనుచరులు కీలకపాత్ర పోషించారని ఆరోపించారు. అటు అధికారులు, ఇటు అనుచరుల సహాయ సహకారాలతో వందల ఎకరాల ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని మండిపడ్డారు. పీలేరులో రాణమ్మ అనే మహిళకు చెందిన రిజస్టర్డ్ భూమి 1.92 ఎకరాలు కొల్లగొట్టి తన తల్లి పద్మావతమ్మ పేర అక్రమ రిజిస్టర్ చేసుకోవడంతో పాటు పక్కనే ఉన్న చెరువు స్థలాన్ని ఆక్రమించాడని ఆరోపించారు. మినిస్టర్ సర్వేయర్ ప్రకాష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయన్నారు. తవ్వేకొద్దీ అనకొండలా భూ ఆక్రమణలు బయటకు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలంటూ ప్రభుత్వాన్ని కోరారు. నేరం చేసిన దోషులకు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మహేష్‌రెడ్డి, రామన్న, రామమూర్తి, జింకల నరసింహులు, రామచంద్ర నాయుడు, అన్వర్ బాషా పాల్గొన్నారు.

ఫైళ్ల దగ్ధం కేసును త్వరగా వెల్లడించండి

- మాజీ ఎమ్మెల్యే డి.తిప్పారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ళ దగ్ధం కేసుపై అధికారులు త్వరగా వెల్లడించాలని, ప్రజల్లో నెలకొన్న స్తబ్దతపై పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు వెల్లడించాలని మదనపల్లె మాజీ శాసనసభ్యులు డాక్టర్ డి.తిప్పారెడ్డి అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సపరేటర్ కార్యాలయ దగ్ధంపై డిజిపి, సిఐడి చీఫ్, రెవెన్యూ శాఖ సెక్రెటరీ సిసోడియాలు పరివేక్షించడం జరిగిందని తెలిపారు. ఇలా ఉన్నతాధికారులు సమీక్షించినప్పటికీ తొమ్మిది రోజులు కావస్తున్న ఇప్పటివరకు ఎలాంటి వివరణలు చేయలేదని ఇప్పటికైనా త్వరగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ అంశంపై కొన్ని పత్రికలు, చానల్లో వైసిపి నాయకులపై ఎన్నో రకాలుగా కథనాలు వెల్లడించారని ఇందులో కొన్ని అంశాలు ఉన్నవి కాగా లేని అంశాలు ఎన్నో లేవనెత్తారని పేర్కొన్నారు. ప్రస్తుత అధికార ప్రభుత్వం వైకాపా నాయకులు పై భయబ్రాంతులకు గురిచేస్తున్నదని ఇది అందరిపై చేయడం సరికాదని, నిజంగా భాగం ఉన్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటే మంచిదని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ మనూజా కిరణ్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్ చంద్రశేఖర్, ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు సురేంద్ర, మస్తాన్ రెడ్డి, వైసీపీ నాయకులు కేశవరెడ్డి, బండపల్లి వెంకటరమణ, జెన్నే చంద్రశేఖర్ నాయుడు, ఆంజనేయులు, రఫీ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

భూకబ్జాలపై విచారణ జరిపించండి : కాంగ్రెస్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వేకోడూరు నియోజకవర్గంలో భూకబ్జాలపై విచారణ జరిపించాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గోసాల దేవి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎన్ శాంతయ్య రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నిధియాదేని కోరారు. సోమవారం రాజంపేట సబ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా వారు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం ఐదు మండలాల ఎస్సీలపైన దాడులు, భూములను కబ్జా చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఇల్లు లేని నీరు పేదలు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మహిళ నాయకులు దేపూరి కావేరి, బద్రావతి, సిగమాల రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు తిథి భోజనం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని డిబిఎన్ పల్లె ప్రాథమిక పాఠశాలలో విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. తిథి భోజనంలో భాగంగా 180 మంది విద్యార్థులకు మాంసాహారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు రఘునాథరాజు, సుబ్బరాయుడు పాల్గొని విద్యార్థులకు ఆహారం వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ పూర్వ విద్యార్థులు గాని, గ్రామస్తులు గాని పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక సందర్భాలలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బయ్య, లయన్స్ క్లబ్ ఆఫ్ రాజంపేట అధ్యక్షులు నరసింహారాజు, షేక్ అబ్దుల్లా, ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, గీతాదేవి, మదాలస పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, కస్తూర్బా బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు ఎంఇఒలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు 320 మందికి పాఠ్య, నోట్ పుస్తకాలను అందజేశామని పేర్కొన్నారు.

రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి

- మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ అన్నారు. సోమవారం నిమ్మనపల్లిలోని రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డ్ గదిని, వీఆర్వోల గదిని, ఇబ్బంది గదులను, డీకేటి భూములకు సంబంధించిన రికార్డులను, కార్యాలయం చుట్టూ పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణపై డిప్యూటీ తహశీల్దార్ తపస్వినిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల జరిగిన ఫైల్ దగ్ధం సంఘటనపై రెవెన్యూ రికార్డుల నిర్వహణలో తనిఖీలు ముమ్మరంగా ఉన్నాయని పేర్కొన్నారు. వీఆర్వోలు, సర్వేయర్లు, డీటీలు ప్రతి ఒక్క సిబ్బంది తమ తమ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ తపస్విని, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.